# యాసంగి పంట లేనట్టే ?

**ట్రయల్ రన్‌లతోనే 'సీతారామ' సరి**

**ముందుకు సాగని కాల్వ నిర్మాణ పనులు**

**సీఎం వచ్చి ప్రారంభించినా అందని నీరు**

**జిల్లా రైతుల ఆశలపై కాంగ్రెస్ నీళ్లు**



అశ్వాపురం మండలంలో గోదావరి నదిపై సీతారామ ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశం

**ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సాగు భూములను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ఆనాడు సీఎం కేసీఆర్ అందుబాటులోకి తీసుకొచ్చిన 'సీతారామ' ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. రూ.17 వేల కోట్ల వ్యయంతో గోదావరి నదిపై సీతారామ ప్రాజెక్టు నిర్మించి అటు సత్తుపల్లి నుంచి ఇటు పాలేరు వరకు సాగునీరందించే గొప్ప కార్యక్రమం కాంగ్రెస్ పాలనలో ఏమాత్రం ముందుకు కదలడం లేదు. గత ఆగస్టు నెలలో ట్రయల్ రన్ వేసి ఈ ఏడాది యాసంగి పంటకు సాగు నీరు అందిస్తామని చెప్పిన పాలకులు చుక్కనీరు కూడా ఇవ్వలేకపోతున్నారు. ఒకసారి కాదు రెండుసార్లు ట్రయల్ రన్ వేసి జలాలను రైతన్నలకు అంకితం చేసినా అది ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో గోదావరి వద్ద ప్రారంభమైన కాల్వ జూలూరుపాడు మండలం వరకు మాత్రమే పూర్తయ్యింది. దీంతోపాటు చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల మీదుగా సత్తుపల్లి వరకు నిర్మిస్తున్న కాల్వ పనులు ఇంకా నత్తనడకన జరుగుతున్నాయి. దీంతో ఈ యాసంగికి సాగునీరు అందుతుందని రైతన్నలు పెట్టుకున్న ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు జల్లింది.**

**- భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 4 (నమస్తే తెలంగాణ)**



కలుపు గడ్డితో అధ్వానంగా ఉన్న కాల్వ

గత కేసీఆర్ సర్కారు హయాంలో దాదాపు పూర్తి చేసుకున్న 'సీతారామ'ను ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులు ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు చేసినా నేటికి చుక్కనీరు కూడా రైతుల పంటలకు అందలేదు. గతంలో వచ్చిన భారీ వర్షాలతో కాల్వలకు గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతుల పనులు నేటికీ కొలిక్కి రాకపోవడం విడ్డూరం. సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరిస్తే గత సీఎం కేసీఆర్‌కు పేరొస్తుందని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి జూలూరుపాడు నుంచి సాగర్ కెనాల్‌కు సీతారామ నీరు లిఫ్ట్ చేసే ఆలోచనతో రూ.100 కోట్లతో మరో కాల్వను మంజూరు చేశారు. దీంతో జూలూరుపాడు మండలంలో ఉన్న రైతులు సీతారామ నీరు మాకు కాకుండా సాగర్‌కు తీసుకెళ్తే.. ఊరుకోమంటూ అఖిలపక్షం నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. అయినా రైతుల మాటలు వినకుండా పనులు చేపడతూనే ఉన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కాల్వ రిపేర్ల పనులతోనే కాలయాపన..

ఆగస్టు నెలలో ట్రయిల్ రన్ వేసిన ముగ్గురు మంత్రులు యాసంగి పంటకు సాగునీరు ఇస్తామని మాటిచ్చారు. కానీ.. అది వచ్చే వానకాలానికి కూడా పంటలకు నీరు అందిస్తారా.. అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇంతవరకు కాల్వ మరమ్మతు పనుల్లోనే ఇరిగేషన్ అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. గత వరదల్లో కాల్వలకు గండ్లు పడితే రైతులు వేసిన పంటలు సైతం నష్టపోయారు. వారికి నష్టపరిహారం దేవుడెరుగుకానీ కాల్వ రిపేరు పనులు ఇంకా పూర్తికాకపోవడం కొసమెరుపు. బీజీ కొత్తూరు నుంచి ములకలపల్లి మండలాల వరకు ఉన్న కాల్వల్లో చుక్కనీరు కూడా లేదంటే నమ్మరేమో. చండ్రుగొండ, అన్నపురెడ్డి మండలాల్లో కూడా కాల్వ పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

### వచ్చే వానకాలానికి సాగునీరు: బి.అర్జున్, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి

కాల్వ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. యాసంగికి నీరు ఇవ్వడం కుదరదు.. వచ్చే వానకాలం పంట నాటికి నీరు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని మండలాల్లో చకచకా పనులు జరుగుతున్నాయి. వరదలకు గండ్లు పడిన కాల్వకు కూడా మరమ్మతులు చేస్తున్నాం.

### సీతారామ నీరు తరలిస్తే ఊరుకోం..



గోదావరి నుంచి సీతారామ కాల్వ ద్వారా సాగునీటిని సాగర్‌కు తరలిస్తే ఊరుకోం. రైతులందరం కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తాం. గుండ్లరేవు చీమలపాడు నుంచి కాల్వ వేయాల్సిందే. దాని డిజైన్ మార్చి ఏన్కూరుకు తరలించాలని చూస్తే ఊరుకోం. గతంలో ఉన్న పాత డిజైన్ ప్రకారమే కాల్వ ఉండాలి.

**– పొన్నెకంటి వెంకటేశ్వర్లు, గుండెపూడి, జూలూరుపాడు మండలం**

### కాల్వల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి..



సీతారామ కాల్వలు తవ్వి చాలా కాలం అయ్యింది. అందులో పశువులు పడి చనిపోతున్నాయి. కొత్త మురిపెంలో నీళ్లు వదిలారు. మళ్లీ అడ్రస్ లేదు. పంటలకు సాగునీరు లేదు. గోదావరిలో నీళ్లు ఉన్నా వదలడం లేదు. కాల్వలకు నీరు వదిలితే మా మండలం రైతులకు ఉపయోగపడుతుంది. మొత్తం పిచ్చిమొక్కలు మొలిచి కాల్వ పెచ్చులు ఊడిపోతున్నాయి.

**– గొగ్గెల ఆదినారాయణ, కమలాపురం, ములకలపల్లి మండలం**

### అప్పటి పనులే ఇప్పటిదాకా చేస్తున్నారు..



కొత్తగా చేసిందేమీ లేదు. అప్పటి నుంచి నడిచిన పనులే ఇప్పుడు జరుగుతున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం నీళ్లు వదిలింది. రెండ్రోజులు నీళ్లు ఉన్నాయి. మళ్లీ రానేలేదు. ఏ పంటకు నీరు ఇస్తారో కూడా చెప్పలేదు. యాసంగికి ఇస్తామన్నారు. ఇచ్చిన మాట నెరవేరడం లేదు. సీతారామను ఏం చేస్తారో ఏమిటో.

**– నరకాటి నాగేశ్వరరావు, ములకలపల్లి**

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

- నేర కేసులను ఛేదించడానికి ఉపయోగకరం
- మణుగూరు ఠాణాలో సీసీ కెమెరాలు ప్రారంభించిన భద్రాద్రి ఎస్పీ



మణుగూరు ఠాణాలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

మణుగూరు టౌన్, జనవరి 4 : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో 92 సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు, ప్రమాదాలు జరిగిన సమయంలో వాహనాలను, వ్యక్తులను గుర్తించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 92 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వీటిలో ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజర్(ఏఎంపీఆర్), పీటీ సైట్ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. వ్యాపారులు, ఇంటి యజమానులు తమ ఇంటి ఆవరణ, వ్యాపార సముదాయాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగలు పడిన తర్వాత కంటే ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై మేడా ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ల కోసం తహసీల్ ఎదుట ధర్నా

**బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకుల డిమాండ్**



ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గుడిసెవాసులు, సీపీఎం నాయకులు

ఇల్లెందు రూరల్, జనవరి 4 : గుడిసెల్లో నివాసం ఉంటున్న తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీలో నివాసముంటున్న గుడిసెవాసులు సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌కుమార్, జిల్లా నాయకుడు అబ్దుల్ నబి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఇంటి నెంబర్లతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, ఎస్‌కే ఖాదర్, కూరపాటి వీరభద్రం, గడ్డం వెంకన్న, వైకుంఠం, రాజు, కమల తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరిన హమాలీల సమ్మె

**మద్దతు తెలిపిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, జేఏసీ, సీఐటీయూ**



ఇల్లెందులో హమాలీలనుద్దేశించి మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు దేవరకొండ శంకర్

ఇల్లెందు/దమ్మపేట/భద్రాచలం, జనవరి 4 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీసీసీ, సివిల్ సప్లై హమాలీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు, దమ్మపేట, భద్రాచలం పట్టణంలో చేపట్టిన సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరింది. హమాలీల సమ్మెకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, జేఏసీ, సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు మాట్లాడుతూ 2024 అక్టోబర్ నెలలో జరిగిన జీసీసీ, సివిల్ సప్లై రేట్ల ఒప్పందాన్ని ప్రభుత్వం జనవరి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం జరిగి మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. దీనిపై జీవో విడుదల చేయకపోవడంతో హమాలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం హమాలీ రేట్ల పెంపు జీవోను విడుదల చేసి, జనవరి నుంచి ఎరియర్స్‌కు బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాస్‌లైన్ నాయకులు రవి, సూర్యనారాయణ, మధు, రాము, హమాలీ మేస్త్రీ బోగి సత్యం, నర్సింహారావు, రొయ్యల ప్రసాద్, జేఏసీ నాయకుడు దేవరకొండ శంకర్, హమాలీ నాయకులు సదానందం, మధు, వీరన్న, రామ్మూర్తి, ప్రముఖ వ్యాపారి పల్లంటి దేశప్ప, సీఐటీయూ నాయకులు బండారు శరత్‌బాబు, గడ్డం స్వామి, నకిరికంటి నాగరాజు, జీసీసీ కార్మికులు ప్రసాద్, శేషు తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేటలో సమ్మె నిర్వహిస్తున్న హమాలీ కార్మికులు

# గుండ్రబంధం వెళ్లిన అధికారుల బృందం

- కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటించిన అధికారులు
- గ్రామస్తులతో సమావేశమై సమస్యలు విన్న బృందం
- నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

లక్ష్మీదేవిపల్లి, జనవరి 4 : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారుల బృందం మండలంలోని గుండ్రబంధం గ్రామాన్ని సందర్శించింది. '80 ఏళ్లుగా బతుకు పోరాటం' అనే శీర్షికన గత నెల 21వ తేదీన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శనివారం జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీవో చంద్రమౌళితో పాటు అధికారుల బృందాన్ని ఆ గ్రామాన్ని సందర్శించాలని ఆదేశించారు. దీంతో సదరు అధికారులు చింతకుంట నుంచి ట్రాక్టర్ సాయంతో గుండ్రంబంధం గ్రామానికి వెళ్తుండగా రహదారి సౌకర్యం సరిగా లేకపోవడంతో ఇసుకలో మొరాయించింది. ఎలాగోలా చేరుకున్న అధికారుల బృందం గ్రామంలో కలియతిరిగి గ్రామస్తులతో సమావేశం నిర్వహించింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ గ్రామస్తులు అధికారుల కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇక్కడున్న 20 కుటుంబాలను చింతకుంట గ్రామానికి తరలించి అక్కడ ఇంటి స్థలాలతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. ముఖ్యంగా వర్షాకాలం నరకయాతన పడుతున్నామని, వరదలతో నెలలతరబడి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న అధికారులు నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ఇంకా గ్రామాన్ని సందర్శించిన వారిలో ఎంపీడీవో చలపతిరావు, విద్యుత్ శాఖ అధికారి రఘు, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ అధికారి సత్యనారాయణ, ఆర్ఐ శంకర్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

# విడిది గృహాల పనులు 90 శాతం పూర్తి

### ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించిన పీవో రాహుల్



పర్యాటకుల తాత్కాలిక విడిది ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 4 : ముక్కోటికి తరలివచ్చే భక్తుల కోసం గోదావరి కటకట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న తాత్కాలిక విడిది గృహాల పనులు 90 శాతం పూర్తయ్యాయని ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. భద్రాచలం గోదావరి ఒడ్డున విడిది గృహాలు, గిరిజన వంటకాలు, గిరిజన కళా ఖండాలకు సంబంధించిన స్టాల్స్, పర్యాటకులు విహరించే బోట్ షికారుకు సంబంధించిన పనులను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటకులు విడిది గృహాల్లో సేద తీరేందుకు, తెప్పలపై విహరించేందుకు బోటు సౌకర్యం, బస చేసిన వారికి డైనింగ్ హాల్ ఏర్పాటు పనులు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు. ఆ ప్రాంతంలో సోలార్ లైట్లు, గోదావరి అందాలను సెల్ఫీల్లో బంధించేందుకు సెల్ఫీ పాయింట్ సైతం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన 10 శాతం పనులు ముక్కోటికి ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పీవో వెంట ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఈఈ రవీందర్, పంచాయతీ ఈవో శ్రీనివాస్ ఉన్నారు.

### గిరిజన మహిళలకు సూచనలు

గిరిజనుల సంప్రదాయక వంటకాలు, కళాఖండాలు పర్యాటకులను ఆకర్షించే విధంగా డిజైన్ చేసి ప్రత్యేక స్టాళ్లలో అమర్చి అమ్మకాలు జరిపే విధంగా చూడాలని పీవో రాహుల్ మేకింగ్ డిజైనర్లతో పాటు గిరిజన మహిళలకు సూచించారు. మేకింగ్ డిజైనర్లతో కలిసి వైటీసీలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో మహిళలు తయారు చేసిన అలంకరణ వస్తువులు, తినుబండారాలకు సంబంధించి పదార్థాలు, ఔషధ మొక్కలను పరిశీలించారు. మార్కెటింగ్ సౌకర్యం ఎలా చేసుకోవాలో వారికి నేర్పించాలన్నారు. ప్లాస్టిక్ అనేది ఏ వస్తువుపై వాడొద్దని, పేపర్ ప్యాకింగ్ డిజైన్ మాత్రమే ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీఎం జీసీసీ సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, ఏపీఎంలు నాగార్జున, హేమంతిని, ప్యాకింగ్, మార్కెటింగ్ డిజైనర్లు కీర్తన, కల్పన, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతిని విస్తరింపజేయాలి

**వంటకాలను పరిశీలించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్**





గిరిజన వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, జనవరి 4 : ఆదివాసీ గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రపంచ దేశాలకు విస్తరింపజేయాలని, దీనికి గిరిజన మహిళలు, వివిధ గ్రూపు సభ్యుల సహకారం అవసరమని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ వైటీసీలో డీఆర్‌డీఏ, ఎంఎస్‌ఎంఈ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, గృహోపకరణాలు, ఔషధ గుణాలు కలిగిన పదార్థాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భక్తులు, పర్యాటకులకు తెలిసే విధంగా ప్రత్యేకంగా రివర్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదావరి ఒడ్డున స్టాల్స్ ఏర్పాటు చేసిన మహిళలు ఇక్కడ నేర్చుకున్న డిజైనింగ్ ప్యాకింగ్‌తో వస్తువులను ప్యాకింగ్ చేసి విక్రయించాలన్నారు. కల్తీలేని తినుబండారాలు తయారు చేసి విక్రయించి గిరిజన మహిళలు జీవనోపాధి పొందాలన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్యాకింగ్ డిజైనర్లు మహిళలకు కరక్కాయల పొడితో టీ తయారు చేయడం, జొన్న, రాగి రవ్వ, మరమరాలతో వాటిపై గ్రూపు పేర్లు ఏ విధంగా పెట్టాలో మహిళలకు అవగాహన కల్పించడంతోపాటు నేర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీఎంజీసీ సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, ప్యాకింగ్ డిజైనర్లు కీర్తన, కల్పన, అనురాధ, భవిత సెల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

**కేయూ వీసీ ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి**

**ఖమ్మంలో కేయూ జోన్ క్రికెట్ పోటీలు**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

ఖమ్మం సిటీ, జనవరి 4 : విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న కేయూ పరిధి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడాంశంలో ప్రతిభ చాటితే చక్కటి అవకాశాలు లభిస్తాయన్నారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు కూడా పెరుగుతాయన్నారు. ప్రతి సంవత్సరం కేయూ పరిధిలో అనేక రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, అవి విద్యార్థుల భవితకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఎందరో ప్రతిభ కలిగిన క్రీడాకారులను కేయూ వెలుగులోకి తీసుకొస్తుందన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఈ ఏడాది చివరివి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, క్రికెట్ పోటీల కో-ఆర్డినేటర్ డాక్టర్ బీ వెంకన్న, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు, యూసీపీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జే ఉపేందర్, అధ్యాపకులు కమల్, సతీశ్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో ఖమ్మం జట్టు ఆదిలాబాద్ జట్టుపై విజయం సాధించింది.